సాక్షి శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 24 । జూన్ । 2024



సోమశిలలో 10.060 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారానికి 10.060 టీఎంసీల నిల్వ ఉంది. 512 క్యూసెక్కుల వరద వస్తోంది. దిగువకు 210 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.73,970
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.6,625
3 శాతం జీఎస్టీతో	రూ.6,824
నవర (8 గ్రా)	రూ.54,592

గరిష్టం/కనిష్టం 37.2 /24.5

వాతావరణం

వాతావరణంలో తేమ 55 శాతం ఉంది. జిల్లాలో సోమవారం ఆకాశం అక్కడక్కడ పాక్షికంగా మేఘావృతంగా ఉంటుంది. చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ప్రతిష్టాత్మకంగా ప్రజాసమస్యల పరిష్కార వేదిక

• కలెక్టర్ ఎం.హరినారాయణన్



నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'లో ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆకాంక్షించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొన్ని నెలలుగా నిలిపివేసిన ఈ కార్యక్రమం తిరిగి సోమవారం నుంచి పునః ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ, కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయొచ్చునని తెలిపారు. స్వీకరించిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కారించేందుకు అన్ని విభాగాలను సమన్వయం చేసుకుని కృషి చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

నేడు పోలీస్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక

నెల్లూరు (క్రైమ్): ప్రతి సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. సోమవారం స్థానిక ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రజలు పోలీసుశాఖా పరమైన ఫిర్యాదులను అందజేసి పరిష్కరించుకోవాలని తెలిపింది.

అడవిలో మంటలు

• 10 ఎకరాల్లో జామాయిల్, 4 ఎకరాల్లో మామిడి తోటల దగ్ధం



అడవిలో వ్యాపించిన మంటలు

ఉలవపాడు: ఉలవపాడులోని పాత ఎరుకల సంఘం గేటు పక్కన ఉన్న అడవిలో మంటలు వ్యాపించాయి. తొలుత జామాయిల్ తోటల్లో మంటలు చెలరేగాయి. ఆ తరువాత క్రమంగా పక్కనే ఉన్న మొగిలి భరత్‌కు చెందిన మామిడి తోటలకు అంటుకున్నాయి. దీంతో తోటల యజమాని అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అయితే వారు రాలేదని స్థానికులు తెలిపారు. మంటలు క్రమంగా పెరగడంతో స్థానికులు అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక శకటం వచ్చినా ఘటనా ప్రాంతానికి వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయింది. దాదాపు 10 ఎకరాల్లో జామాయిల్, 4 ఎకరాల్లో మామిడి తోటలు దగ్ధమయ్యాయి.



రాత్రి సమయంలో ఎగిసిపడుతున్న మంటలు


ఆటవిక రాజ్యం

నారా రెడ్‌బుక్ రాజ్యాంగం దాష్టీకాలు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ జరిగిన మరుసటి రోజు నుంచి జిల్లాలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పేట్రేగిపోయి ప్రవర్తిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా రెండు వారాలుగా జిల్లాలో టీడీపీ మూకలు సాగిస్తున్న భౌతిక దాడులు, ఆస్తుల విధ్వంసాలు, అరాచకాలు, దాష్టీకాలతో సామాన్య ప్రజలు వణికిపోతున్నారు. ఇళ్లల్లోకి చొరబడి మహిళలనే విచక్షణ మరిచి ఆటవికంగా హింసకు పాల్పడుతున్నారు. మరో వైపు ప్రభుత్వం నిర్మించిన సచివాలయాలు, ఆర్బీకేలు, వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లపై శిలఫలకాల ధ్వంసాలు కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ స్థలాల కబ్జా సాగిస్తున్నారు. జగనన్న లేఅవుట్లలో పేదలు నిర్మించుకుంటున్న ఇళ్లను కూల్చేశారు. పార్టీలో క్రియాశీలకంగా పనిచేసిన నేతల ఆస్తులను కాల్చి బూడిద చేశారు. వీరి ఆటవిక చర్యలను అడ్డుకునేందుకు సాహించలేక మౌనంగా రోధిస్తున్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పుడు ఆ పార్టీ ఇలాంటి చర్యలకు పాల్పడలేదని ప్రజలు గుర్తుచేస్తున్నారు. వైఎస్సార్‌సీపీకి ఓటు వేయకపోయినా.. సంక్షేమ పథకాలు అందించారని ప్రజలు అంటున్నారు. నారా రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారా? అని మండిపడుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు





2024 JUNE 21 ట్రాక్టర్, ఆక్వా సామగ్రి దహనం

తోటపల్లిగూడూరు మండలంలోని కోడూరు పంచాయితీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కావల్‌రెడ్డి రంగారెడ్డికి చెందిన ఓ ట్రాక్టర్, ఏయిరేటర్లు, ఇతర ఆక్వా సామగ్రిని టీడీపీ వర్గీయులు దహనం చేశారు. మాజీ మంత్రి కాకాణి సమీప బంధువైన రంగారెడ్డి గడిచిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి తీవ్రంగా శ్రమించారు. ఇది గిట్టని స్థానిక టీడీపీ నాయకులే అధికార అండతో ఈ దుశ్చర్యకు పాల్పడ్డారు. ఈ ఘటనలో దాదాపు రూ.50 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

2024 JUNE 10 జగనన్న లేఅవుట్లోని నిర్మాణ ఇల్లు ధ్వంసం



టీడీపీ నాయకుడు ధ్వంసం చేసిన జగనన్న లేఅవుట్‌లోని పునాదులు

దుత్తలూరు మండలం ఏరుకొల్లు పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎస్సీలకు ఇచ్చిన జగనన్న లేఅవుట్‌లోని నిర్మాణంలో ఉన్న తొమ్మిది ఇళ్లను అదే పంచాయతీ రావిళ్లవారిపల్లికి చెందిన పిడికిటి వెంకటేశ్వర్లు జేసీబీతో ధ్వంసం చేశాడు. ఏరుకొల్లు ఎస్సీ కాలనీ సమీపంలో జగనన్న లేఅవుట్ ఏర్పాటు చేసి 36 ఇళ్లు మంజూరు చేయగా వాటిలో 20 నిర్మాణాలు చేపట్టి పునాది దశలో ఉన్నాయి. ఎస్సీ కాలనీ వాసులు వైఎస్సార్‌సీపీకి ఓటేశారని అక్కసుతో 9 ఇళ్ల నిర్మాణాలను జేసీబీతో ధ్వంసం చేశాడు. ఇదేమని ప్రశ్నిస్తే మీ దిక్కున్న చోట చెప్పుకోండని బెదిరించాడని ఎస్సీ కాలనీవాసులు తెలిపారు. ధ్వంసం చేసిన తొమ్మిది ఇళ్లలో 6 కాంట్రాక్టర్ నిర్మించగా 3 ఇళ్లు సొంతంగా నిర్మించుకుంటున్నారు.

వైఎస్సార్‌సీపీ నేత ఇంటి ప్రహరీ, మెట్లు కూల్చివేత

కొండాపురం మండలం గానుగపెంట పంచాయతీ ఆదిమూర్తిపురంలో గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సామాన్య కార్యకర్త తుమ్మల బాలయ్యకు చెందిన ఇంటి ప్రహరీతో పాటు, మెట్లను అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు యాగర్లమూడి శ్రీనివాసులు, పాటిబండ్ల వేణు, తలపనేని నరసింహులు ఎన్నికల కౌంటింగ్ జరిగిన రాత్రి జేసీబీ తీసుకెళ్లి కూల్చివేశారు. తుమ్మల బాలయ్య అనే వ్యక్తి ఓ సాధారణ వైఎస్సార్‌సీపీ కార్యకర్త అని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటేసినందుకు టీడీపీ నాయకులు ఈ దాష్టీకానికి పాల్పడ్డారు.

పేట్రేగిపోతున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

- హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న సింహపురి
- వైఎస్సార్‌సీపీ వర్గీయులపై భౌతికదాడులు
- ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసాలు
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న పోలీసులు

2024 JUNE 7 వైఎస్సార్‌సీపీ నేత కారు అద్దాలు ధ్వంసం

వెంకటాచలం పోలీస్‌స్టేషన్ ఎదుటే వైఎస్సార్‌సీపీ కార్యకర్త దూడల మనోజ్‌కుమార్ తన కారును పోలీస్‌స్టేషన్ బయట నిలిపి లోపలికి వెళ్లారు. ఆ కారును టీడీపీ కార్యకర్తలు సండి సురేష్, బాలిబోయిన మహేష్ ధ్వంసం చేశారు. పోలీస్‌స్టేషన్ ఎదుటే ఈ ఘటన జరిగినా పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పరిస్థితికి అద్దం పడుతోంది.

వీఎస్‌యూనూ వదలని మూకలు



వీఎస్‌యూలో శిలఫలకాలను గడ్డపారతో ధ్వంసం చేస్తున్న టీడీపీ నాయకులు

కాకుటూరులోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరుతో సెంట్రల్ లైబ్రరీ శిలాఫలకాలను టీడీపీ నాయకులు గడ్డపారతో శిలాఫలకాలను ధ్వంసం చేశారు. దివంగత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి పరిపాలనా భవనం వద్దకు చేరుకుని, ఆయన విగ్రహాన్ని భవనంలో ఎలా ఏర్పాటు చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు. పరిపాలన భవనంలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తొలగించాలని, లేకుంటే తామే ధ్వంసం చేస్తామని అధికారులను హెచ్చరించారు.

2024 JUNE 9 వైఎస్సార్‌సీపీ నేతలపై దాడులు



దగదర్తిలో వైఎస్సార్సీపీ కార్యకర్త శ్రీనివాసులు ఇంటి నిర్మాణాన్ని జేసీబీతో కూలుస్తున్న దృశ్యం

కావలి పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి నివాసం ముందు టీడీపీ నేతలు, కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. డీజే పెట్టి, బాణసంచా పేలుస్తూ రామిరెడ్డి ఇంటి గేటును కాళ్లతో తన్నుతూ వీరంగం సృష్టించారు. దగదర్తిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త కాంద్ర శ్రీనివాసులు ఇంటికి సంబంధించిన నిర్మాణాన్ని జేసీబీతో కూల్చేశారు. తడకలూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ సర్పంచ్ ఆత్మకూరు గిరినాయుడిపై దాడికి తెగబడ్డారు. దీంతో గిరినాయుడి చేతులు, కాళ్లకు గాయాలయ్యాయి. ఎంపీపీ తాళ్లూరు ప్రసాద్‌నాయుడి ఇంటి ఎదుట కవ్వింపు చర్యలకు పాల్పడి బాణసంచా కాల్చి ఇంట్లో వేశారు.

2024 JUNE 5 ద్విచక్ర వాహనం దహనం

కావలి నియోజకవర్గంలోని దగదర్తి మండలం యలమంచిపాడులో స్థానిక టీడీపీ నాయకులు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త షేక్ మస్తాన్‌పై దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన తల్లి షేక్ బీబీపైన కూడా దాడి చేశారు. 75 ఏళ్ల వయస్సున్న వృద్ధురాలు అనే కనికరం కూడా లేకుండా తలపైన దాడి చేయడంతో తీవ్రంగా గాయపడింది. అదే రోజు తడకలూరులో టీడీపీ నాయకులు స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యకర్త యలమా వెంకటేశ్వర్లుకు చెందిన ద్విచక్ర వాహనాన్ని పెట్రోల్ పోసి తగుల బెట్టారు.

2024 JUNE 11 ఆర్బీకే శిలాఫలకం ధ్వంసం

ఉలవపాడు మండలం ఆత్మకూరులో నిర్మించిన రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి వేళ ధ్వంసం చేశారు. దీంతో పాటు రూమ్ తాళాన్ని సైతం పగలగొట్టారు. రూమ్ లోపల ఉన్న ఫ్యాన్‌ను సైతం ఎత్తుకెళ్లారని, టీడీపీ కార్యకర్తలు ఈ పనిచేసి ఉండొచ్చని.. దీనిపై ఫిర్యాదు చేయనున్నామని కాంట్రాక్టర్ తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నేతపై దాడి

బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలో వైఎస్సార్‌సీపీ నేతలు గిరికృష్ణ, మురళీకృష్ణ ఇంటిపై 15 మంది టీడీపీ కార్యకర్తలు దాడి చేశారు. విచక్షణా రహితంగా కొట్టి భయానక వాతావరణాన్ని సృష్టించారు. దాదాపు 15 మందికిపైగా టీడీపీ కార్యకర్తలు బైక్‌లపై తన ఇంటి ముందు పెద్ద శబ్దాలు చేస్తూ.. బయటకు రా నీ అంతు చూస్తామంటూ బెదిరించారు. తన తల్లి గుండెజబ్బుతో బాధపడుతోందని చెప్పినా, వినిపించుకోకుండా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చి తన ఇంటిపై వేశారని తెలిపారు. అర్ధరాత్రి 11 గంటల సమయంలో మరోసారి వచ్చి కర్రలతో విచక్షణరహితంగా కొట్టారు. అంతటితో ఆగకుండా త్వరలోనే చంపేస్తామని తనను బెదిరించారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్ వెళ్లి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

2024 JUNE 12 వైఎస్సార్‌సీపీ వర్గీయులపై దాడులు



సర్పంచ్ ఇంట్లో ధ్వంసమైన సామగ్రి



టీడీపీ నాయకుల దాడిలో గాయపడిన నాగసునీల్‌రెడ్డి

చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన రోజు అనంతసారం మండలం శంకరనగరం గ్రామంలో వైఎస్సార్‌సీపీ నేత, సర్పంచ్ ఇంటి వద్ద టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ప్రశ్నించిన వైఎస్సార్‌సీపీ నేతలపై మారణాయుధాలతో దాడులకు తెగబడ్డారు. వారి ఇంట్లోకి టీడీపీ నేతలు చొరబడి టీవీలు, ఫ్రిజ్‌లను ధ్వంసం చేశారు. సర్పంచ్ వరలక్ష్మి నివాసం వద్ద డీజే, బాణసంచా కాల్చుతూ రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించారు. టీడీపీ నేతలు సర్పంచ్ వరలక్ష్మి ఇంట్లోకి చొరబడి మారణాయుధాలతో దాడి చేశారు. సర్పంచ్‌పై దాడికి తెగబడ్డారు. ఇంట్లో చొరబడి ధ్వంసం ఆస్తులు చేశారు. ఆ పక్క ఇంట్లోనే ఉన్న సర్పంచ్ బంధువు రవికుమార్‌రెడ్డి, అడ్డుకోబోయిన ఆయన బావమరిది నాగసునీల్‌రెడ్డి, మామ రామసుబ్బారెడ్డిపై గొడ్డలితో దాడి చేశారు. ఇంట్లోని వృద్ధులని కూడా చూడకుండా ఇద్దరు మహిళలపై దాడికి పాల్పడ్డారు.

వైఎస్సార్‌సీపీ జెండా స్థూపం ధ్వంసం

నెల్లూరు నగరంలోని 54వ డివిజన్ జనార్దన్‌రెడ్డికాలనీలో ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ జెండాను, స్థూపాన్ని, శిలాఫలకాన్ని కొందరు ధ్వంసం చేశారు. తెలుగుదేశం పార్టీ వారే ఈ దుశ్చర్యకు పాల్పడి ఉంటారని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపించారు.

నవరత్నాల బోర్డు ధ్వంసం

2024 JUNE 13

రామాయపట్నం గ్రామ సచివాలయంపై ఉన్న నవరత్నాల బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. తాడుకట్టి పైకెక్కి ధ్వంసం చేశారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి



సాజిద్‌పై దాడి చేస్తున్న నిందితులు

నెల్లూరు నగరంలోని చంద్రబాబునగర్‌కు చెందిన 29వ డివిజన్ వైఎస్సార్‌సీపీ కార్యకర్త సాజిద్‌పై స్థానిక టీడీపీ కార్యకర్త హమీద్ తన అనుచరులతో కలిసి దాడి చేశారు. వీరి నుంచి తప్పించుకుని ఆస్పత్రికి వెళ్తున్న సాజిద్‌ను మార్గమధ్యలో అటకాయించి మరోమారు విచక్షణరహితంగా దాడి చేశారు. అప్పుడు కాదురా...ఇప్పుడు మిమ్మల్ని ఎవరూ కాపాడతారు.. వైఎస్సార్సీపీకి చెందిన కొందరి లిస్టు తమ వద్ద ఉందని.. వీరందరికీ ఇదే గతిపడుతుందని బెదిరించారు.

వైఎస్సార్‌సీపీ నేత ఇల్లు ధ్వంసం

2024 JUNE 15



కావలి పట్టణం 13వ వార్డు పుల్లారెడ్డినగర్‌లో వైఎస్సార్‌సీపీ నేత శ్రీనివాసులురెడ్డి ఇంటి నిర్మాణ పనులను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు శనివారం జేసీబీతో ధ్వంసం చేశారు. రెవెన్యూ అధికారులు జారీ చేసిన పట్టా ఉన్నప్పటికీ అధికారులు ఇంటి నిర్మాణ పనులను తొలగించారు.

2024 JUNE 21 మహిళపై టీడీపీ కార్యకర్త దాడి

పంచాయతీ నిధులతో నిర్మించిన రచ్చబండను టీడీపీ కార్యకర్త ధ్వంసం చేస్తుండగా అడ్డుకున్న మహిళపై ఇనుప రాడ్‌తో దాడికి తెగబడిన ఘటన వెంకటాచలం మండలం కసుమూరులో జరిగింది. పది మందికి ఉపయోగపడే రచ్చబండను ధ్వంసం చేసి ఇంటి నిర్మాణం చేసుకోవడం ఏమిటని స్థానికంగా నివాసం ఉంటున్న ఉప్పు చెంగమ్మ ప్రశ్నించడంతో సదరు టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్ ఆమె తలపై రాడ్డుతో దాడి చేశాడు. ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. మహిళపై జరిగిన దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డ్రగ్స్‌కు అడ్డాగా సింహపురి

మెట్రోపాలిటన్ సిటీలకే పరిమితమైన మత్తు, మాదక ద్రవ్యాల విష సంస్కృతి జిల్లాకు పాకింది. సింహపురి డ్రగ్స్ మాఫియాకు కేంద్ర బిందువుగా మారుతోంది. పారిశ్రామిక రంగంతో పాటు విద్యారంగంలోనూ ఎంతో అభివృద్ధి సాధిస్తోంది. వేలాది మంది దేశ, విదేశీయులు పరిశ్రమల్లో ఉపాధి పొందుతున్నారు. దేశ, విదేశీయ విద్యార్థులు జిల్లాలో వివిధ విద్యా సంస్థల్లో ప్రొఫెషనల్ కోర్సులను అభ్యసిస్తున్నారు. విదేశీయులతో పాటు స్వదేశీయులు సైతం మత్తుకు మెల్లగా అలవాటు పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో ఎక్కడ డ్రగ్స్ దొరికినా అధిక శాతం కేసుల్లో మూలాలు నెల్లూరులోనే చూపిస్తుండడం కలవరపాటుకు గురి చేస్తోంది.

- మూలాలు నెల్లూరులోనే..
- జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ విక్రయాలు
- తాజాగా తెలంగాణలో నెల్లూరీయుడి అరెస్ట్

నెల్లూరు (క్రైమ్): డ్రగ్స్‌కు అడ్డాగా నెల్లూరు కేంద్రంగా మారుతోంది. డ్రగ్స్‌కు బానిసైన కొందరు ఇతర రాష్ట్రాల నుంచి కొకైన్, ఎక్స్‌టాసీ, హెరాయిన్, ఆంఫిటామైన్, కేటామైన్, మెఫెడ్రేన్ తదితరాలను తీసుకువచ్చి విద్యార్థులు, యువతను బానిసలుగా మారుస్తున్నారు. తాజాగా తెలంగాణ రాష్ట్రం మాదాపూర్ పోలీసుస్టేషన్ పరిధిలోని దుర్గంచెరువు డాక్టర్స్ కాలనీ వద్ద నెల్లూరుకు చెందిన వెంకటసాయిచరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 12.72 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వెంకటసాయిచరణ్ మరికొందరితో కలిసి ఇతర రాష్ట్రాలకు సైతం డ్రగ్స్‌ను విక్రయిస్తున్నట్లు అక్కడి పోలీసుల విచారణలో వెల్లడైంది. దీంతో అన్నీ కోణాల్లో అక్కడి పోలీసులు విచారిస్తున్నారు. నెల్లూరులోనూ అతని ముఠా డ్రగ్స్ వ్యాపారం కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే నెల్లూరుకు చెందిన పలువురు యువకులు డ్రగ్స్ సరఫరా చేస్తూ తెలంగాణ పోలీసులకు, యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులకు చిక్కి జైలు పాలయ్యారు.

యువత, విద్యార్థులే లక్ష్యంగా..

యువత, విద్యార్థులే లక్ష్యంగా మాదక ద్రవ్యాల ముఠాలు పని చేస్తున్నాయి. జిల్లాలోని కొందరు గంజాయి విక్రేతలు వాటిని ప్యాకెట్లుగా తయారు చేసి యువత, విద్యార్థులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. గంజాయి మత్తుకు అలవాటు పడిన వారు మత్తు చాలక డ్రగ్స్ వైపు మరలుతున్నారు. వారి బలహీనతలను ఆసరాగా చేసుకున్న డ్రగ్స్ మాఫియా కొకైన్, ఎల్ఎస్‌డీ, ఎండీఎంఏ, కేటామైన్ తదితర డ్రగ్స్‌ను వారికి మిల్లీ గ్రాము, గ్రాములు లెక్కన వేలాది రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వ్యవహారం కొన్నేళ్లుగా చాపకింద నీరులా సాగుతోంది. 2014లో సైబరాబాద్ పోలీసులు మాదకద్రవ్యాల విక్రయ ముఠాను అరెస్ట్ చేసి రూ.3 లక్షలు విలువ చేసే కేటామైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముఠాలో నెల్లూరు కరెంట్ ఆఫీసు సెంటర్‌కు చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్ నుంచి కేటామైన్‌ను నెల్లూరుకు తీసుకువచ్చి యువతకు, విద్యార్థులకు అలవాటు చేస్తున్నాడని అప్పట్లో పోలీసులు వెల్లడించారు.

- అదే ఏడాది నెల్లూరు రైల్వే పోలీసులు శస్త్రచికిత్స సమయంలో వాడే మత్తు ఇంజెక్షన్ వెయిల్స్‌ను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు.
- 2016లో నెల్లూరు జిల్లాకు చెందిన సురేష్‌బాబు, శ్రీహరి తెలంగాణకు చెందిన కిశోర్ ముఠాగా ఏర్పడి డ్రగ్స్‌ను విక్రయిస్తుండగా హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులు డ్రగ్స్‌ను హైదరాబాద్ నుంచి నెల్లూరు నగరానికి తీసుకువచ్చి యువతకు విక్రయిస్తున్నారని విచారణలో తేలింది. వారి వద్దనుంచి రూ.60 లక్షలు విలువ చేసే ఆంఫిటామైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.
- నెల్లూరు నగరానికి చెందిన షేక్ సాధిక్ మాదక ద్రవ్యాలకు బానిసైయ్యాడు. చెన్నైకు చెందిన లక్ష్మీనారాయణ, నైజీరియాకు చెందిన శామ్యూల్ ఉజ్బెకిస్థాన్ దేశానికి చెందిన యెహీరమ్‌నుసెసెల ద్వారా మాదక ద్రవ్యాలను సేకరించి వాటిని గ్రాముల చొప్పున విక్రయిస్తుండగా 2019లో జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు.
- నెల్లూరు నగరానికి చెందిన రాజేష్, ఆషిక్ హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. వారు తమ స్నేహితులతో కలిసి ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి హైదరాబాద్, నెల్లూరులోని స్నేహితులకు విక్రయిస్తున్నారు. వీరి కదలికలపై నిఘా ఉంచిన టీఎస్ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో అధికారులు గతేడాది వారిని అరెస్ట్ చేశారు. వీరి సెల్ ఫోన్లను పరిశీలించగా నెల్లూరు నగరానికి చెందిన 33 మంది డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న వారు ఉన్నారని తేలింది.
- గూడూరుకు చెందిన సాత్విక్ ఏకంగా తన స్నేహితులతో కలిసి ధనలక్ష్మీపురంలో మాదక ద్రవ్యాలు తయారు చేస్తుండగా పోలీసులు అరెస్ట్ చేశారు.
- తాజాగా శనివారం మాదాపూర్ పోలీసులు నెల్లూరుకు చెందిన వెంకటసాయిచరణ్‌ను అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 12.72 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కర్ణాటక రాష్ట్రం నుంచి ట్రావెల్స్ బస్సుల ద్వారా డ్రగ్స్‌ను దిగుమతి చేసుకుని వివిధ పట్టణాలకు సరరా చేస్తున్నట్లు వెల్లడైంది. నెల్లూరులో విక్రయిస్తున్నారని తేలింది. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు స్పందించి డ్రగ్స్ విక్రయాలపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి కట్టడి చేయాల్సిన అవసరం ఉంది.



గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ (ఫైల్)



మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేసిన డ్రగ్స్ ముఠా సభ్యులు

స్త్రీనిధితో ఆర్థిక ప్రగతి

- సకాలంలో రుణాల మంజూరు
- జిల్లాలో 39,289 స్వయం సహాయక సంఘాలు
- గత ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.142 కోట్లు
- మంజూరు చేసింది రూ.149 కోట్లు
- 2024–25 ఆర్థిక సంవత్సరం లక్ష్యం రూ.170 కోట్లు



నెల్లూరు(పొగతోట): జిల్లాలోని స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలతో పాటు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.స్వయం ఉపాధికి రుణాలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 39,289 స్వయం సహాయక గ్రూపులు ఉండగా, 4,09,523 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం 2023–24 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలోని 27,401 మంది మహిళలకు రూ.142 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా, లక్ష్యానికి మించి 28,168 మంది మహిళలకు రూ.149 కోట్లు మంజూరు చేశారు. అదే విధంగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో 34 వేల మంది మహిళలకు రూ.170 కోట్ల మేర స్త్రీనిధి రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్దేశించింది.

స్త్రీనిధి రుణాలు సరళతరం

ప్రభుత్వం గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా స్వయం సహాయక గ్రూపుల్లోని మహిళల ఆర్థిక ప్రగతికి బ్యాంకు లింకేజీ రుణాలు మంజూరు చేస్తోంది. వాటితో పాటు స్త్రీనిధి ద్వారా జీవనోపాధి రుణాలను సైతం మంజూరు చేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్త్రీనిధి రుణాలను పరిమితంగా మంజూరు చేసేవారు. ఒక్కో పొదుపు గ్రూపు లోని ముగ్గురు మహిళలకు మాత్రమే రుణాలు మంజూరు చేసేవారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళల ఆర్థిక ప్రగతే లక్ష్యంగా స్త్రీనిధి రుణాల మంజూరును సరళతరం చేసింది. స్వయం సహాయక గ్రూపుల్లోని సభ్యులందరికీ బీమాతో కూడిన రుణాలను మంజూరు చేసింది. ఒక్కో మహిళకు రూ.లక్ష వరకు స్త్రీనిధి నుంచి జీవనోపాధి రుణం పొందే అవకాశం కల్పించింది. ఈ అవకాశాన్ని జిల్లాలోని స్వయం సహాయక మహిళలు సద్వినియోగం చేసుకున్నారు. జీవనోపాధి రుణాలు తీసుకుని సొంతగా వ్యాపారాలు ప్రారంభించి ఆర్థిక పురోగతి సాధిస్తున్నారు. గ్రామీణ ప్రాంత మహిళలు అత్యవసర సమయాల్లో సూక్ష్మరుణ సంస్థల చేతుల్లో చిక్కుకోకుండా స్త్రీనిధి రుణాలు ఎంతో ఆదుకుంటున్నాయి. పిల్లల వివాహాలు,చదువులు ఇతర అవసరాల కు కూడా స్త్రీనిధి రుణాలు అండగా నిలుస్తున్నాయి.

రుణ చెల్లింపుల్లో కొత్త విధానం

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో స్త్రీనిధి రుణాలకు సంబంధించి భారీగా అవకతవకలు జరిగాయి. స్త్రీనిధి రుణాలకు సంబంధించిన నగదును ప్రతినెలా పొదుపు సభ్యుల నుంచి రికవరీ చేసి స్త్రీనిధి ఖాతాలో జమ చేయాల్సిన కొందరు వెలుగు సిబ్బంది చేతివాటం చూపారు. స్త్రీనిధి నగదును ఖాతాల్లో జమచేయకుండా స్వాహా చేసిన ఘటనలు కోకొల్లలు. ఈ పరిస్థితిని గమనించిన 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా నూతన విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. స్త్రీ నిధి రుణం పొందిన పొదుపు సభ్యురాలు తన సొంత బ్యాంకు ఖాతా లేదా భర్త, పిల్లల బ్యాంకు ఖాతాల నుంచి ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం ద్వారా రుణాలను చెల్లించే అవకాశం కల్పించింది. ఏటీఎం కార్డుతోనూ చెల్లించే అవకాశాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. రుణాలను తిరిగి సక్రమంగా చెల్లించే మండలాలకు వసూలు చేస్తున్న వడ్డీలో 2 శాతం నగదును కేటాయించింది.

సకాలంలో స్త్రీనిధి రుణాలు

2023–24 ఆర్థిక సంవత్సరంలో 28,168 మంది మహిళలకు రూ.149 కోట్ల రుణాలు మంజూరు చేశాం. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 34 వేల మందికి రూ.170 కోట్ల రుణాల మంజూరును లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళలు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థిక ప్రగతి సాధించేలా చర్యలు చేపడుతున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని స్వయం సహాయక గ్రూపు మహిళలకు సకాలంలో స్త్రీనిధి రుణాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకున్నాం.

–కామక్షయ్య,స్త్రీనిధి ఏజీఎం

స్త్రీనిధి రుణాల కేటాయింపు (రూ.కోట్లలో)

సంవత్సరం	లక్ష్యం		మంజూరు		
	సభ్యులు	నగదు	సభ్యులు	నగదు	
2013–14	15,000	40.00	17,791	36.76	టీడీపీ ప్రభుత్వంలో
2014–15	15,000	40.00	8,310	18.86	
2015–16	17,500	50.00	15,834	37.01	
2016–17	17,500	50.00	19,406	46.68	
2017–18	25,000	75.00	19,842	60.57	
2018–19	15,000	60.00	9,176	44.18	
2019–20	22,000	110.00	22,178	111.26	వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో
2020–21	27,800	139.00	16,500	85.00	
2021–22	34,717	173.57	45,008	152.01	
2022–23	35,924	179.62	33,175	113.18	
2023–24	27,401	142	28,168	149	

48 గంటల్లో స్త్రీనిధి రుణాలు

- పొదుపు సభ్యులు కోరిన 48 గంటల్లో స్త్రీనిధి రుణాలు మంజూరు చేయడం జరుగుతుంది.
- సభ్యురాలు స్త్రీనిధి రుణం కోసం ఇంటి నుంచి ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేదు. ఒక్క రూపాయి ఖర్చు కూడా లేకుండా మంజూరు చేయడం జరుగుతుంది.
- సురక్ష పథకం ద్వారా స్త్రీనిధి రుణానికి రక్షణ
- రుణ మంజూరుపై ప్రాసెసింగ్ చార్జీలు, టాక్స్, ఇతర రుసుములు లేవు.
- స్త్రీనిధి రుణం పొందడానికి ఎటువంటి సిఫార్సులు అవసరం లేదు
- పొదుపు సభ్యులందరూ స్త్రీనిధి రుణం పొందవచ్చు.

వైభవంగా వెంగమాంబ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- భక్తిశ్రద్ధలతో నిలుపు కార్యక్రమం
- పసుపు దంచేందుకు పోటీపడిన మహిళలు

దుత్తలూరు: జిల్లాలోని నర్రవాడ వెంగమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు ఆదివారం నిలుపు కార్యక్రమంతో వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు వేదపండితులు వెంగమాంబ, గురవయ్య దంపతుల విగ్రహాలను పూలతో విశేషంగా అలంకరించి గణపతిపూజ, సహస్రనామార్చన, కుంకుమార్చన, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు సతీ సమేతంగా యాగశాలలో హోమం నిర్వహించారు. అనంతరం కలశపూజ నిర్వహించి ఊరేగింపుగా ఆలయంలోకి తీసుకెళ్లారు. తొలిరోజు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. సంతానం లేని మహిళలు సంతానం కోసం అమ్మవారి వద్ద వరపడ్డారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎండు కొబ్బరిని అగ్నిగుండంలో వేసి భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. కాగా విద్యుద్దీపాలంకరణతో వెంగమాంబ ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు శోభాయమానంగా మారాయి. వెంగమాంబ, వినాయకుడు, దుర్గాదేవి, అష్టలక్ష్మి, తదితర దేవతామూర్తుల కటౌట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే వెంగమాంబ పుట్టినిల్లు అయిన వడ్డిపాళెంలోని రేణుకా ఎల్లమ్మ గుడిలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, వెంగమాంబ, రేణుకా ఎల్లమ్మతల్లి విగ్రహమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించారు.



విద్యుద్దీపాలంకరణలో నర్రవాడలోని వెంగమాంబ దేవస్థానం (ఇన్‌సెట్‌లో) విశేషాలంకారంలో వడ్డిపాళెంలోని వెంగమాంబ పేరంటాలు

అట్టహాసంగా నిలుపు

వెంగమాంబ పుట్టినిల్లు వడ్డిపాళెంలోని దేవర ఇంట్లో ఆదివారం రాత్రి నిలుపు కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముందుగా పచ్చవ వంశస్తులు లాంఛనంగా పసుపు దంచే కార్యక్రమాన్ని ప్రారంభించారు. పసుపు దంచితే సకల శుభాలు కలుగుతాయని భక్తుల నమ్మకం. కుటుంబ సమేతంగా పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన ముత్తైదువులు పసుపు దంచేందుకు పోటీ పడ్డారు. అనంతరం పసుపు, కుంకుమలను అమ్మవారి దేవస్థానం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు.



వడ్డిపాళెంలో పసుపు దంచుతున్న భక్తులు

కనులపండువగా సిరిమానోత్సవం



సిరిమానును తిప్పుతున్న భక్తులు



సిరిమానోత్సవానికి తరలివచ్చిన భక్తజనం

ఇందుకూరుపేట: మండలంలోని గంగపట్నంలో కొలువైన చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో అత్యంత ప్రధానమైన ఘట్టం సిరిమానోత్సవం(రథోత్సవం)ను ఆదివారం రాత్రి కనులపండువగా నిర్వహించారు. అమ్మవారి రథాన్ని విశేషంగా అలంకరించి గ్రామంలోని ప్రధాన కూడలి నుంచి ఆలయ వద్దకు తరలించి సిరిమానోత్సవం జరిపారు. సిరిమానును లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. భక్తుల అమ్మవారి నామస్మరణతో గ్రామ పరిసరాలు మారుమోగాయి. చాముండేశ్వరీదేవి ఆలయంలో పూలంగి సేవ నిర్వహించారు. ఆలయ అర్చకులు నూతలపాటి అనిల్‌శర్మ, మాచవోలు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూ కట్టారు. పూలంగి సేవకు ఉభయకర్తలుగా కేతిరెడ్డి మహేష్‌రెడ్డి, రేవతి దంపతులు వ్యవహరించారు. స్థానిక విఘ్నేష్ యూత్ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ చేపట్టారు. ఉదయం సంప్రదాయంగా తీర్థవాది నిర్వహించారు. చాముండేశ్వరీదేవిని సముద్రం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు అమ్మవారి వెంట జేజేలు పలుకుతూ తీరం చేరుకుని సముద్ర స్నానాలు ఆచరించారు. తీర్థవాదిలో పాల్గొన్న భక్తులకు అమ్మ హేచరీ అధినేత దుగ్గా శంకర్‌రెడ్డి, దుగ్గా శివారెడ్డి ప్రసాదాలను అందజేశారు. సీఐ శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై వీరేంద్రబాబు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

తెప్పోత్సవం నేడు

చాముండేశ్వరీదేవి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి తెప్పోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం వెనుక వైపు ఉన్న కోనేరులో జరిగే తెప్పోత్సవానికి ఆలయ పాలక వర్గం, సిబ్బంది ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్లుప్తంగా

జర్నలిస్టులపై గ్రావెల్ మాఫియా దాడికి యత్నం

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని రామచంద్రాపురంలో జర్నలిస్టులపై గ్రావెల్ మాఫియా దాడికి దిగడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. రామచంద్రాపురం నుంచి కొందరు గ్రావెల్ అక్రమంగా తరలిస్తున్నారని శనివారం సాయంత్రం స్థానికులు అందించిన సమాచారంతో విలేకరులు అక్కడికి చేరుకున్నారు. పరిసర ప్రాంతాలను వీడియోలు, ఫొటోలు తీస్తుండగా గ్రావెల్ మాఫియా రాడ్డులతో దాడికి యత్నించింది. విలేకరులు బుచ్చిరెడ్డిపాళెం సీఐ హైమారావుకు సమాచారం అందించగా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. దీంతో గ్రావెల్ మాఫియా అక్కడి నుంచి జారుకుంది. దాడికి ఉపయోగించిన ఇనుప రాడ్లు, పైపులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దాడికి యత్నించిన వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

దాడిని ఖండించిన మాజీ ఎమ్మెల్యే ప్రసన్న

ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటూ ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే జర్నలిస్టులపై గ్రావెల్ మాఫియా దాడికి దిగడం దారుణమని కోవూరు మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఖండించారు. వృత్తి రీత్యా వార్తల సేకరణకు వెళ్లిన విలేకరులపై దాడి చేయడం సరికాదన్నారు. దీని వెనుక ఎంతటి వారున్నా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు ఉన్నా పోలీసులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బామా సుధాకర్‌రెడ్డి కన్నుమూత



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

కావలి: కావలి కేంద్రంగా కళాకారులు, కళారంగానికి 15 ఏళ్లుగా సేవ చేస్తున్న లేబాకుల సుధాకర్‌రెడ్డి అలియాస్ బామా సుధాకర్‌రెడ్డి (72) ఆదివారం మృతి చెందారు. ఇటీవల వెన్నుపూస శస్త్రచికిత్స చేయించుకున్న ఆయన పట్టణంలోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 2గంటల సమయంలో తీవ్రమైన గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. సుధాకర్‌రెడ్డి కళారంగంపై మక్కువతో ఆంధ్రాబ్యాంకు ఉద్యోగానికి రాజీనామా చేసి కళామతల్లి సేవలో నిమగ్నమయ్యారు. ప్రముఖ సినీ గాయకులు బాలసుబ్రహ్మణ్యం పేరుతో బాలసుబ్రహ్మణ్యం ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ అసోసియేషన్ (బామా)ను ఏర్పాటు చేసి ఏటా పోటీలు నిర్వహిస్తూ అంతరించిపోతున్న గ్రామీణ కళలకు జీవం పోశారు. దీంతో 'బామా' సంస్థ పేరే చివరకు ఆయన ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. అలాగే తన తల్లితండ్రుల పేర్లు కలిసి వచ్చేలా 'నా' అనే స్వచ్ఛంద సేవా సంస్థను ఏర్పాటు చేసి ఎటువంటి ఆదరణ లేని వృద్ధులకు ప్రతినెలా నిత్యావసర సరుకులు, పింఛన్లు అందించేవారు. ఆయన మృతిపై పట్టణ ప్రజలు, కళాకారులు సంతాపం తెలిపారు.

అపూర్వ సమ్మేళనం



పూర్వవిద్యార్థులు

- వీఆర్ కళాశాల 1978–81 బ్యాచ్ బీఎస్సీ విద్యార్థులు
- 43 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులు

నెల్లూరు(బారకాసు): 43 ఏళ్ల క్రితం వారంతా కలిసి డిగ్రీ చదువుకున్నారు. ఆ తరువాత ఉన్నత చదువుల చదివి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. నాలుగు దశాబ్దాల తరువాత ఒకరినొకరు కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకున్నారు. ఈ మధుర క్షణాలకు నగరంలోని మినర్వాగ్రాండ్ హోటల్ వేదికైంది. నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన 1978–81 బ్యాచ్ బీఎస్సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పూర్వ విద్యార్థుల ఆహ్వాన కమిటీ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు, డాక్టర్ జీ దయాకర్‌రావు నేతృత్వంలో అరబిందో ఫార్మా(హైదరాబాద్) కంపెనీ డైరెక్టర్ ఎం మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో మినర్వాగ్రాండ్ హోటల్‌లో ఆదివారం నిర్వహించారు. 43ఏళ్ల క్రితం వీఆర్ కళాశాలలో బీఎస్సీ విద్యనభ్యసించిన పూర్వవిద్యార్థులు నెల్లూరుతో పాటు దేశంలోని ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ స్థిరపడ్డారు. వారిలో పది మంది వరకు నెల్లూరులో వైద్యులుగా సేవలందిస్తున్నారు. మరికొందరు వివిధ కంపెనీల్లో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వారంతా ఆత్మీయ సమ్మేళనానికి తరలివచ్చారు. నాలుగు దశాబ్దాల క్రితం తమతో చదువుకున్న స్నేహితులను కలుసుకుని గత స్మృతులను నెమరువేసుకుంటూ ఎంతో సంతోషంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేసి పాదాభివందనం చేసి తమ గురుభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా పలువురు పూర్వవిద్యార్థులు తమ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. మధ్యాహ్న భోజన విరామం తరువాత పూర్వ విద్యార్థులు వీఆర్ కళాశాలకు చేరుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను నెమరవేసుకుంటూ ఆటపాటలతో గడిపారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు సమాజానికి తమవంతుగా ఏదోరకంగా సేవ చేయాలని సంకల్పించారు. అందుకు విరాళాల ద్వారా నగదు సమకూర్చుకుని వచ్చే ఏడాది నుంచి సేవా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించినట్లు వారు పేర్కొన్నారు.

కుమార్తెను చూసేందుకు వస్తుండగా..



ప్రమాదానికి కారణమైన లారీ



భార్య మృతదేహం వద్ద రోదిస్తున్న లక్ష్మీనారాయణ

- బైక్‌ను ఢీకొన్న లారీ
- భార్య మృతి, భర్తకు గాయాలు

నెల్లూరు(క్రైమ్): నెల్లూరులో ఉంటున్న కుమార్తెను చూసేందుకు బైక్‌పై వస్తున్న దంపతులను లారీ ఢీకొనడంతో భార్య మృతి చెందగా, భర్త గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఎన్టీఆర్‌నగర్ పెట్రోల్‌బంకు జంక్షన్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..విడవలూరు మండలం ముదివర్తి గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, సరోజనమ్మ(48) దంపతులు. వారి కుమార్తె హారిక నెల్లూరులోని రామ్మూర్తినగర్‌లో ఉంటున్నారు. కుమార్తెను చూసేందుకు కే లక్ష్మీనారాయణ, సరోజనమ్మ దంపతులు ఆదివారం ఉదయం బైక్‌పై నెల్లూరుకు బయలుదేరారు. ఎన్టీఆర్‌నగర్ పెట్రోల్‌బంకు జంక్షన్ వద్దకు వచ్చేసరికి కావలి నుంచి చెన్నై వైపు మితిమీరిన వేగంతో వెళుతున్న లారీ వెనుకగా బైక్‌ను ఢీకొని వెళ్లిపోయింది. బైక్ అదుపుతప్పి దంపతులు రోడ్డుపై పడ్డారు. సరోజనమ్మ తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. లక్ష్మీనారాయణకు గాయాలయ్యాయి. కొద్దిసేపటి వరకు తనతో సరదాగా మాట్లాడుతూ వచ్చిన భార్య విగతజీవిగా పడి ఉండడం చూసి లక్ష్మీనారాయణ గుండెలవిసేలా రోదించారు. తల్లి మృతి వార్త తెలుసుకున్న హారిక ఘటనా స్థలానికి చేరుకుని కన్నీటిపర్యంతమయ్యారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నార్త్‌ట్రాఫిక్ ఎస్సై కే గీతారమ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. గాయాలపాలైన తండ్రిని హారిక చికిత్స నిమిత్తం కిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు ఎస్సై కేసు నమోదు చేశారు. ప్రమాదానికి కారణమైన లారీని స్వాధీనం చేసుకున్నారు. మృతదేహానికి ప్రభుత్వ వైద్యులు శవపరీక్ష నిర్వహించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భక్తిశ్రద్ధలతో అంకురార్పణ పూజలు



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని అయ్యప్పస్వామి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న గోదా సమేత గురువాయూరు మహావిష్ణు స్వామి ఆలయంలో మహాసంప్రోక్షణ కుంభాభిషేక మహోత్సవాలకు ఆదివారం సాయంత్రం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా విశేష పూజలు, హోమాలు నిర్వహించారు. స్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కే వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, మోహన్, శంకర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 150
లేయర్ (లైవ్)	: 120
బ్రాయిలర్ చికెన్	: 264
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 294
లేయర్ చికెన్	: 204